# 15652 వద్ద మద్దతు




**సమీక్ష** : గత గురువారం డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపును దృష్టిలో పెట్టుకొని మార్కెట్ అధిక ఊగిసలాటను ప్రదర్శించింది. ఆ తరువాత, రిజర్వు బ్యాంకు కీలక రేట్లను మున్ముందు మళ్లీ పెంచవచ్చన్న భయంతో జరిగిన విక్రయాల కారణంగా భారీ నష్టాలతో ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, షార్ట్ కవరింగ్‌ల కారణంగా దేశీయ మార్కెట్లు లాభాలతోనే ప్రారంభమయ్యాయి. ఫెడరల్ రిజర్వు మరిన్ని ఉద్దీపన చర్యల దిశగా అడుగువేయవచ్చన్న అంచనాల మధ్య సెన్సెక్స్ 16549 దాకా దౌడు తీసింది. అయితే ఆహార ద్రవ్యోల్బణం పెరగడం విక్రయాలకు పురికొల్పింది. అధిక వడ్డీ రేట్ల వల్ల కార్పొరేట్ కంపెనీల వృద్ధి తగ్గొచ్చన్న అంచనాల మధ్య సెంటిమెంటు మరింత దిగజారింది. చివరకు వారం మొత్తం మీద 293 పాయింట్ల నష్టంతో 15849 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల పనితీరు** గత వారంలో ఎఫ్ఐఐలు నికరంగా రూ.4,370.80 కోట్ల భారీ విక్రయాలు చేయడం గమనార్హం. మ్యూచువల్ ఫండ్‌లు మాత్రం రూ.714.40 కోట్ల నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా** కమోడిటీల డిమాండుపై అంచనాలు తగ్గడంతో లోహ షేర్లు భారీగా కుంగాయి. మరో వైపు వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే బ్యాంకింగ్, స్థిరాస్తి సూచీలూ దిగజారాయి. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా మారడంతో ఐటీ షేర్లలో కొంత ర్యాలీ కనిపించింది. ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ వంటి రక్షణాత్మక సూచీలూ రాణించాయి.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:7గా నమోదవడం.. మార్కెట్లో బేరిష్ సెంటిమెంటు ఉందనడాన్ని సూచిస్తోంది.**

**భవిష్యత్ అంచనా** మార్కెట్ కీలకమైన 16,000 స్థాయి దిగువకు చేరడం చూస్తే, వచ్చే కొద్ది వారాలు లేదా నెలల్లో 14,400-15,000 స్థాయి వరకు దిద్దుబాటుకు లోనయ్యే ఆస్కారం ఉందని చెప్పవచ్చు. ప్రస్తుతం మార్కెట్లు 18 నెలల కనిష్ఠ స్థాయి వద్ద చలిస్తున్నాయి. 16,433 కీలక స్థాయి కంటే ఎగువన స్థిరపడితేనే (కనీసం వరుసగా రెండు రోజుల పాటు) స్వల్పకాలంలో రికవరీని ఆశించొచ్చు.

**ప్రభావిత అంశాలు** అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో పుంజుకోవచ్చని ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ బెర్నాంకే ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే అమెరికా జీడీపీ రెండో త్రైమాసికంలో కొంత నెమ్మదించడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లు రానున్న కొద్ది రోజులూ ఊగిసలాటకు లోను కావచ్చు. దీని ప్రభావం దేశీయ మార్కెట్ల పైనా ఉండవచ్చు. ఇక వారం వారీ ద్రవ్యోల్బణ గణాంకాలూ, ముడి చమురు ధరలు, ఎఫ్ఐఐల విక్రయాల ధోరణి, పార్లమెంటరీ సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలు ఈ వారంలో ట్రేడింగ్ జరిగే మూడు రోజులు (31న రంజాన్, 1న వినాయక చవితి కారణంగా మార్కెట్లకు సెలవు) ప్రభావం చూపనున్నాయి.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 15652, 15330, 15104; **తక్షణ నిరోధ స్థాయిలు:** 16046, 16256, 16550

**మార్కెట్‌కు 15652 స్థాయి వద్ద తక్షణ మద్దతు ఉంది.**

–సతీశ్ కంతేటి, జెన్ మనీ